హిమబిందు






మన గాలి, మన నేల, మన వాళ్ళు,

మన లోగిళ్ళు...... నెలనెలా ఓ దృక్కోణం

# నలుపులో మెరుపుంది!

ఈ మధ్య ఓ రోజు తోచక, అర్ధరాత్రి ఒంటిగంటకి, 'ఏం చేస్తున్నావు?' అంటూ విజయవాడలో ఉన్న మా అమ్మకి ఫోన్ చేశాను. 'బ్లాక్ ఈజ్ బ్యూటిఫుల్' అని టీ.వీలో ప్రోగ్రామ్ వొస్తుంటే చూస్తున్నాను. 'ఏమిటి విశేషాలు.. ఈ వేళప్పుడు ఫోన్ చేశావు' అంది. ఏదో ఒకటి, టైమ్‌పాస్ కావడమే నా ఉద్దేశం తప్ప, పెద్దగా విశేషాలేమీ లేవు. అయితే, తను చెప్పిన ప్రోగ్రామ్ టైటిలేదో ఆసక్తిగా కనిపించడంతో దాని మీదకి సంభాషణని మళ్ళించాను. అమెరికాలో అయితే, 'బ్లాక్ ఈజ్ బ్యూటిఫుల్' అనే టాపిక్ ఎక్కువగా ఆఫ్రో అమెరికన్‌ల పోరాటాల్లో, ముఖ్యంగా వారి ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించే అంశాలలో వినిపిస్తుంది. మరి మనదగ్గర ఏ కోణంలో చూపిస్తున్నారు అని అడిగాను. 'ఆ విషయాలేంటో నాకు తెలియవు కానీ, ఈ కార్యక్రమంలో మాత్రం మన దగ్గర తెల్లగా ఉన్న వారికి ఎలా ఇన్‌స్టంట్ రికగ్నిషన్, రెస్పాన్స్ దొరుకుతుంది.. వాళ్ళకి ఉండే అడ్వాంటేజ్‌లు ఏమిటి? అసలు తెల్లతోలు మీద మనకింత పిచ్చి ఎందుకు? ఈ ప్రభావం మన సమాజం మీద, ముఖ్యంగా మహిళలు, కాలేజీకి వెళ్ళే అమ్మాయిల మీద ఎలా ఉంటోంది.. వాళ్ళు ఎలాంటి ఒత్తిడులకి గురవుతున్నారు...? అందు కోసం ఏం చేస్తున్నారు? ఇలా మాట్లాడుతున్నారు.. ఇది ఒక్క రోజు కార్యక్రమం కాదులే రోజుకో అంశం చొప్పున నాలుగు రోజులు సాగుతోంది' అని వివరించింది. నిజమే! ఇదేదో అందరం ఆలోచించాల్సిన పాయింట్‌గానే అనిపించింది. పొద్దున లేచిన తరువాత, 'రాత్రి అమ్మకి ఫోన్ చేశాను.. బ్లాక్ ఈజ్ బ్యూటిఫుల్ అనే ప్రోగ్రామ్ చూస్తోందట..' అని వెంకట్‌తో అంటే, 'నీకు తెలియదా... చాలామందికి ఇండియాలో కనిపించే బ్యూటీయే అది... ఇల్లు, స్థలం ఏం కొనాలన్నా అక్కడి మన బ్లాక్ అండ్ వైట్ రెండూ ఉంటాయి.. ప్రస్తుతం జరుగుతున్న కరీంనగర్ ఎలక్షన్లే తీసుకో బ్లాక్ చాలా అలవోకగా రాయల్‌గా.. చేతులు మారుతూ కనిపిస్తుంది.. ఇలా చెప్పుకుంటూ పోతే, ఒకటా రెండా...' అంటూ తన మార్కెట్ స్టడీ, పాలి'ట్రిక్స్'ని కలిపి ఏకరువు పెట్టడం మొదలు పెట్టాడు.. తన ఉత్సాహానికి బ్రేక్ వేసి, అసలు 'విషయం' డిస్కషన్ పెట్టేటప్పటికి సమయం పట్టినా, ఇదేదో మాట్లాడుకోవలసిన విషయమేనని అంగీకరించాడు.

ఆ సమయంలో మా ఇంట్లోనే ఉన్న మరో మిత్రుడు, 'ఇండియా దాకా ఎందుకు, అమెరికాలో ఉన్న మన ఇండియన్స్ ఇచ్చే మ్యాట్రిమోనియల్ యాడ్స్ చూసినా కూడా ఈ విషయం అర్థమైపోతుంది. శరీరపు రంగుతో డిస్క్రిమినేట్

చెయ్యడం రేసిజం అని తెలిసినా కూడా.. 'ఫెయిర్ స్కిన్' ఉన్న వాళ్ళే కావాలని స్పష్టంగా ఎంతో మంది ప్రకటనలు ఇస్తుంటారు. అలాగే ఆఫ్రోఅమెరికన్స్‌ని, ఇక సాటి ఇండియన్స్‌ని అయితే రకరకాల కుల ప్రస్తావనలతో, వాళ్ళ శరీర ఛాయలను మేళవించి తేలికగా వ్యాఖ్యలు చేసే వాళ్ళు కూడా మనకేం కొత్తకాదు.. ఇప్పుడు ఆలోచిస్తే, నాకో ప్రశ్న కలుగుతోంది.. పెద్దగా ఆలోచించకుండానే, ఏమాత్రం సిగ్గుపడకుండా మన సొసైటీ 'రేసిజాన్ని' పాటిస్తోందా..' అని ఎదురు ప్రశ్న వేశాడు.

'నేనయితే అమెరికా గురించి మాట్లాడటంలేదు. పైగా మా అమ్మ చెప్పిన దాని ప్రకారం ఇది ఒక మహిళా కార్యక్రమంలో భాగంగా ప్రసారం చేస్తున్న ప్రోగ్రాం కాబట్టి నేను అదే కోణంలో చూడగలను.. ఈ టాపిక్ వినగానే నాకు ఇండియాలో ఉన్నప్పుడు చూసిన కొన్ని అడ్వర్టయిజ్మెంట్లు గుర్తొచ్చాయి.. మొదటిది,

'ఇంత నల్లగా ఉన్న పిల్లకి పెళ్ళెలా అవుతుంది..? అని ఇంట్లో వాళ్ళు బాధపడుతుంటే, ఆ అమ్మాయి కూడా విని బాధపడుతుంది.. ఇంతలో ఎవరో సలహా మీద, ఫెయిర్ అండ్ లవ్లీ వాడుతుంది.. అంతే ఆరువారాల్లో ఆమె తెల్లబడిపోయి.. రాజకుమారుడు లాంటి భర్త లభిస్తాడు', ఇంకో అడ్వర్టయిజ్‌మెంట్లో నల్లగా ఉన్న అమ్మాయికి అన్నిట్లోను ఫెయిల్యూర్లే ఎదురవుతాయి. కానీ, ఎప్పుడైతే ఈ క్రీములు, గట్రా వాడి 'మెరుగైన ఛాయ'ని పొందుతుందో ప్రొఫెషనల్‌గా కూడా సక్సెస్ అవుతుంది.. ఉదాహరణకి ఈ రెండు యాడ్స్‌నే తీసుకుంటే నల్లని శరీరఛాయ అనేది అటు వివాహానికి, ఇటు కెరీర్‌కి కూడా 'అనర్హమైనదే'నన్న తీర్పే కనపడుతుంది. మనిషి మేథస్సుకి, మానసిక పరిపక్వతకి ఇక్కడ ఎటువంటి గుర్తింపు ఉండదు. ఇవ్వాళ్టెపు టీ.వీ ఆన్ చేస్తే, ఇలాంటి యాడ్స్ ఎన్నో కనిపిస్తున్నాయి.. అయినా కూడా ఇటువంటి యాడ్స్ మీద మనం అభ్యంతరం వ్యక్తం చెయ్యం. అదేదో సమంజసమైన విషయం లాగానే తీసుకుంటున్నాం.

మన పురాణాల్లోను, అలాగే సాహిత్యంలోను అందానికి కొలమానంగా 'తెల్లని ఛాయ'ని ప్రతిష్టించారు.. అక్కడి నుంచే మనలో ఈ 'దాస్యం' అనండి, లేదా 'ఆరాధన' ఇలా రకరకాల భావనలు మొదలైనాయనటంలో సందేహం లేదు. కానీ జీవన సౌందర్యానికి కూడా మన సాహిత్యంలో అంతే ప్రాధాన్యం ఉంది అనే విషయాన్ని మర్చిపోయేట్లు నేటి ప్రచారం సాగుతోంది. చాలా కాలం పరిపాలించిన బ్రిటీష్ వాళ్ళు మనల్ని నల్లవాళ్ళని గేలి చేసి అవమానించారు.. అయినా కూడా మనకి పౌరుషం లేదు. మన రంగు మీద మనకి విశ్వాసం, గౌరవం లేవు. మనదేశంలో, మన సగటు శరీర ఛాయని 'తక్కువ' చేస్తూ, వినియోగదారులమైన మన మీద వ్యాఖ్యలు చేస్తున్నా మనకు చీమ కుట్టినట్టయినా అనిపించకపోవడం, పైగా సదరు ప్రకటనల్లో చెప్పినట్టు తెల్లపడటమే మన లక్ష్యం అవుతుండటం, మన 'మైండ్‌సెట్‌లో' ఏమైనా లోపముందా అని ఆలోచించేలా చేస్తోంది. ఇటువంటి దుష్ప్రచారం వల్ల ఎంత మంది అమ్మాయిలు ఆత్మన్యూనతకి లోనవుతూ, తమ జీవితం పట్ల విశ్వాసాన్ని కోల్పోతున్నారోననే ఆందోళన కూడా కలుగుతోంది., అట్లా అని, తెల్లని ఛాయ కలిగిన వారిని ద్వేషించాలనో, ఇండియాలో, నల్లని ఛాయను కలిగిన వాళ్ళందరూ డిప్రెషన్‌లో ఉన్నారనో, వాళ్ళు జీవితంలో విజయం సాధించలేకపోతున్నారనో నా ఉద్దేశం కాదు.. కానీ ఒక 'తప్పుడు సందేశం' ప్రజల్లోకి వెళుతున్నప్పుడు, అది మనలో పాతుకుపోయేటట్లు ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు జాగురూకతతో మెలగాల్సిన అవసరం, విచక్షణతో వ్యవహరించాల్సిన నేపథ్యం తప్పని సరి అని నా ఉద్దేశం' అన్నాను. 'ఎక్కడో చదివాను, ఇండియాలో, స్కిన్‌కేర్ ఇండస్ట్రీ దాదాపు 300 మిలియన్ల బిజినెస్ చేస్తోందట... ప్రతి సంవత్సరం పదిహేనుశాతం పెరుగుదల కూడా ఉంటోందట... ఇంత పెద్ద మార్కెట్ ఉంది కాబట్టే అన్ని కాస్మొటిక్ కంపెనీలు ఇండియా వైపు పరుగులు పెడుతున్నాయి.. ఇది పోటీ ప్రపంచం.. ప్రపంచీకరణ ప్రభావం ఇలానే ఉంటుంది మరి' అన్నాడు వెంకట్.

మిస్ యూనివర్స్‌లు, మిస్ వరల్డ్ లాంటి టైటిల్స్ మనవైనప్పటి నుంచీ, ఈ క్రాస్ రెండింతలైన మాట వాస్తవమే,

అలాగే ఈ ఇండస్ట్రీ పెరగటం వల్ల చాలా మందికి ఉపాధి లభిస్తున్న పాయింట్ కూడా ఒప్పుకుంటున్నాను. కానీ మన సమాజం మీద, మనుషుల శరీరాల మీద మానసికంగా, శారీరకంగా దాడి జరుగుతోంది. స్కిన్ వైటనింగ్ క్రీమ్‌ని అధికంగా ఉపయోగించడం వల్ల అనేక ఆఫ్రికన్, ఆసియా దేశాలలోని మహిళల్లో మెర్క్యురీ పాయిజనింగ్‌కి సంబంధించిన ఆరోగ్య సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతున్నాయని హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఒక న్యూరాలజీ ప్రొఫెసర్ చేసిన పరిశోధనలో తేలింది. అలాగే కొన్ని వైటనింగ్ క్రీమ్‌లలో ఉండే స్టెరాయిడ్ల వల్ల స్కిన్ కాన్సర్ వచ్చే ప్రమాదం కూడా ఉందట. (Neil Persadsingh, a jamaican dermatologist andu author of Acne in Black Women(1999))

వీటన్నిటికంటే కూడా, రాను రాను పెరుగుతున్న ఈ ‘అనాగరికమైన‘ భావదాస్యం, అది తయారు చేస్తున్న ‘మెరుపులోకం‘లో మనిషికి, మనసుకి, ఆలోచనలకి, అంతరంగాలకి, ఉద్వేగాలకి, ఉద్యమాలకి చోటు మిగులుతుందా? తెలుపు మోజులో నల్లని వాస్తవాలని గుర్తించే స్పర్శని మనం కోల్పోతామేమోననేది నా భయం!
http://www.thehindubusinessline.com/life/2006/02/24/stories/2006022400290400.htm

